క్లుప్తంగా

క్రీడాపోటీల్లో పాల్గొనండి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించ బోయే క్రీడాపోటీల్లో మహిళలు, యువతీయువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ కోరారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో మాట్లాడుతూ.. యువతీ యువకులకు, చిన్నారులకు క్విజ్, ఎస్సే రైటింగ్, టగ్ ఆఫ్ వార్, బాల్ ఇన్ బాస్కెట్, బాల్‌త్రో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో రన్నింగ్ రేస్, ఉత్తమ హరిత గృహం వంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ హరిత గృహం పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెల 28వ తేదీలోపు జీఎం కార్యాలయ పర్యావరణ విభాగంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. అలాగే వేడుక ప్రాంగణంలో తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేసుకోదలచిన వ్యాపారస్తుల వారు 31వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. స్టాల్స్ ఏర్పాటుకు సంబంధించి అభ్యర్థులు 7075972531, 8332975284 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అవగాహన సదస్సు

దుమ్ముగూడెం: ఎంపీపీ రేసు లక్ష్మి అధ్యక్షతన స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ రెండో విడతలో భాగంగా మండలం పరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు సునీల్, సందీప్‌లు 100 శాతం మరుగుదొడ్లు నిర్మించుకోవడం, ఇంకుడు గుంతలు నిర్వహించుకోవడం, భూగర్భ జలాలు పెంపొందించుకోవడం, తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్, మలవ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీడీఓ ముత్యాలరావు, ఏపీఓ సుకన్య, పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గెలుపు కాంగ్రెస్‌దే..

చండ్రుగొండ: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ విజయఢంకా మోగిస్తుందని టీపీసీసీ సభ్యురాలు, ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి ధీమా వ్యక్తం చేశారు. చండ్రుగొండ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డితో కలిసి ఆమె బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు, యూత్ డిక్లరేషన్‌లను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. తొలుత ఆమె మండలంలోని పార్టీ ముఖ్య నాయకులను కలుసుకుని భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, నల్లమోతు రమణ, టి.సురేష్, గోవింద్‌రెడ్డి, అంతటి రామకృష్ణ, బడుగు వెంకటేష్, సర్పంచ్ పద్దం వినోద్, సురేష్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో జూన్ 18న నిర్వహించే క్విజ్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 16 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు జూన్ 17 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీను, నరేష్, మహమ్మద్ ఖాన్, వెంకటేష్, సుధీర్, ప్రదీప్, మనీ, వేణు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: ఉభయ తెలుగు రాష్ట్రాల ఆదివాసీల సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జూన్ 11న నిర్వహించే జై ఆదివాసీ ఆంధ్ర తెలంగాణ ఆదివాసీల భారీ బహిరంగ సభకు సంబంధించిని కరపత్రాలను ఆ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య దొర బుధవారం ఆవిష్కరించారు. పట్టణంలోని గొటుల్, గోండ్వాన అధ్యయన కేంద్రంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రా ప్రభుత్వాలు బీసీలను ఎస్టీ జాబితాలో కలిపే తీర్మాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం వేదికగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జూన్ 11 బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మడివి నెహ్రూ, పూనెం శ్రీను, వెంకటేశ్వర్లు, రాఘవయ్య, ప్రశాంత్, చిన్నారావు, నాగమణి, వెంకటలక్ష్మి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి

కరకగూడెం: మండలంలో వాతవరణ పరిస్థితులు రోజుకో రకంగా మారుతుండడంతో ప్రజలు డెంగ్యూ, విషపూరిత జ్వరాల బారిన పడుతున్నారని, వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల వారిగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ.. డెంగ్యూపై ఎటువంటి అవగాహన లేక గిరిజనులు మూఢనమ్మకాల వైపు మొగ్గుచూపుతున్నారని, వైద్యశిబిరాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు.

‘సీతమ్మ’ కష్టాలు తీరేనా..

- భూములు కోల్పోతున్న రైతులు
- ఎకరాకు రూ.30 లక్షలు డిమాండ్
- ససేమిరా అంటున్న ప్రభుత్వం
- సర్వేపై స్పష్టతనివ్వని అధికారులు


నష్టపరిహారం కోసం రాస్తారోకో చేస్తున్న చర్ల, దుమ్ముగూడెం నిర్వాసితులు (ఫైల్)

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతమ్మ సాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు భూనిర్వాసితులకు కష్టాలు తీరేలా కనిపించడం లేదు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఆనకట్టకు 200 మీటర్ల దిగువన సుమారు రూ.3,461 కోట్ల నిధులతో సీతమ్మ సాగర్‌ను నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సుమారు 4లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే దీని ముఖ్య లక్ష్యంగా నిర్మాణం చేపట్టారు. అశ్వాపురం మండలం కమ్మరిగూడెం వైపు నుంచి పనులు ప్రారంభించి దాదాపు 60శాతం పనులు పూర్తి కావోచ్చాయి.

నిర్వాసితుల పోరాటం..

సీతమ్మ సాగర్ ప్రాజెక్టు 1 మొదటి ఫేస్‌లో దుమ్ముగూడెం మండలం 740ఎకరాలు, 16గ్రామాలు, 500మంది రైతులు తమ భూములను కోల్పోతున్నారు. అలాగే చర్ల మండలం లో 1100ఎకరాలు, 680 రైతులు, 19 గ్రామాలు భూములు కోల్పోతున్నారు. రైతులు పలు రకాలుగా అభ్యంతరాలు, నిరసనలు వ్యక్త పరిచినప్పటికీ జిల్లా స్థాయి అధికారి కనుసన్నల్లో తూతూమంత్రంగా నడిపించారు. ‘1/70చట్టం వల్ల.. ఈ భూములకు రిజిస్ట్రేషన్ తక్కువ ఉన్నందున.. ఎకరానికి 3.20లక్షలు మాత్రమే ఇవ్వాలి. కానీ ప్రభుత్వ దయతో మీకు 8లక్షలు ఇస్తోంది’ అంటూ రైతులను భయం, అయోమయంలో పడేసి పెసా సభలను పూర్తిచేశారు. ఆనాటి నుంచే రైతులు నష్టం పరిహారం రెట్టింపు చేయాలని మూడు పంటలు పండే పంట పొలాలకు కనీసం రూ.30 లక్షలు అయినా ఇవ్వాలని, మిగిలిన భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. దీనికి రైతులకు స్పష్టమైన హామీ, భరోసా ఏ ఒక్కరూ ఇవ్వటం లేదు. మండల స్థాయి అధికారి నుండి జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని నిర్వాసితులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన తీవ్రతరం..

మరలా తిరిగి కరకట్టల నిర్మాణం కోసం రెండో సర్వేను అధికారులు చేపట్టగా భూనిర్వాసితులు ఎకరాకు రూ.30లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సర్వేను అడ్డగిస్తున్నారు. రైతులు ఆందోళనలను చేస్తున్నప్పటికీ అధికారులు సర్వే పనులు చేసుకుంటూ వెళ్తున్నారు. దీంతో నిర్వాసిత రైతులు ఆందోళనలను తీవ్రతరం చేస్తున్నారు. నష్ట పరిహారం చెల్లించాలని రాస్తారోకోలు చేస్తున్నారు. అంతే కాకుండా ముంపునకు గురవుతున్న భూముల్లో ఉన్న జామాయిల్, మామిడి, ఇతర కలప, కలపేతర, తాటి చెట్లు ఇలాంటి వాటికి కూడా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మొదటి సర్వేలో ఇలాంటి చెట్లకు సంబంధించి అధికారులు రాసుకోలేదు. విషయం తెలిసిన రైతులు నిలదీస్తే కొంతమందికి మాత్రం రాశారు.

నిర్వాసితుల డిమాండ్లివే..

ప్రజలను భాగస్వామ్యం లేకుండా జరుగుతున్న, రెండో దఫా భూసేకరణ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. మిగులు భూములకు ప్రభుత్వం ఉచితంగా మోటార్లు ఇచ్చి సాగునీరు సౌకర్యం కల్పించాలని, రెండోవిడత చేస్తున్న సర్వే భూములకు నష్టపరిహారంగా భూమికి భూమి ఇవ్వాలి లేదా ఎకరాకు రూ.30 లక్షల ఇవ్వాలి అని డిమాండ్ చేస్తున్నారు. పర్ణశాలలో నిలిచిపోయిన కరకట్ట పనులు తక్షణమే ప్రారంభించాలని,రానున్న వరదల నుంచి దుమ్ముగూడెం, చర్ల మండలాల ప్రజలను కాపాడాలని కోరుతున్నారు. కరకట్ట ప్రాజెక్ట్ డిజైన్ (డీపీఆర్)ను గ్రామసభల ద్వారా ప్రజలకు తెలపాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో గోదావరి వరదల నుంచి ప్రజలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రాజెక్టు డీపీఆర్‌ను అందజేయాలి



ప్రాజెక్టు నిర్మాణం కోసం కావాల్సిన భూమి అంతా మొదటి సర్వేలోనే తీసుకున్నాం అని చెప్పిన అధికారులు రెండో సర్వే కోసం ప్రయత్నాలు మొదలు పెట్టడం ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. ప్రాజెక్టు డిజైన్ డీపీఆర్‌ను ప్రజల ముందు ఉంచి అనుమానాలు నివారించాలి.

– కొమరం దామోదరరావు, భూనిర్వాసితుల సంఘం మండల అధ్యక్షుడు

ఎకరాకు రూ.30 లక్షలివ్వాలి



మూడు పంటు పండించే భూములను ప్రాజెక్టు నిర్మాణంలో కోల్పోతున్నాం. మొదటి సర్వేలో అధికారులు భయపెట్టి నష్ట పరిహారం చెల్లించారు. రెండో విడత సర్వేలో భూములు కోల్పోతున్న వారికి ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలని లేదా భూమికి భూమి ఇవ్వాలి. మిగిలిన భూములను సాగు చేసుకునేందుకు నీరు అందించాలి.

– నీలాద్రివర్మ, రైతు, గోగుబాక, చర్ల మండలం

పర్యావరణ హితానికి పాటుపడాలి


కార్ పూలింగ్ కార్యక్రమం నిర్వహిసున్న సింగరేణి అధికారులు

మణుగూరురూరల్: పర్యావరణ హితానికి ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో మార్పులు చేసుకోవాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ సూచించారు. మిషన్ లైఫ్‌లో భాగంగా బుధవారం సీటైప్ ప్రాంతంలో కార్ పూలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం సీ టైప్ కాలనీ నుంచి జీఎం కార్యాలయం వరకు కొనసాగింది. సీటైప్‌లో నివసిస్తున్న హెచ్‌ఓడీలు, ఇతర అధికారులు కార్ పూలింగ్‌లో పాల్గొని పర్యావరణహిత జీవన శైలిపై అవగాహన కల్పించారు. ఇంధనపు పొదుపు ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించవచ్చని జీఎం రామచందర్ సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూ జీఎం డి.లలిత్‌కుమార్, డీజీఎం పర్సనల్ రమేష్, డీజీఎం పర్చేజ్ శ్రీనివాసమూర్తి, పర్యావరణ అధికారి శ్రీనివాస్, డీవైఎస్ఈ రాజేంద్రప్రసాద్, ఈఈ సివిల్ డీవీఎస్ఎస్ ప్రవీణ్, సీనియర్ పీఓ సింగు శ్రీనివాస్, రామేశ్వరరావు, సీనియర్ సెక్యూరిటి ఆఫీసర్ షబ్బీరుద్దీన్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి బాబుల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సవరణకు సహకరించాలి

అశ్వారావుపేటరూరల్: ఓటరు కార్డుల్లో తప్పుల సవరణ, మార్పులు, చేర్పులకు రాజకీయ పార్టీల బాధ్యులు సహకరించాలని తహసీల్దార్ లూథరన్ విల్సన్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గర్భిణి మృతి

ములకలపల్లి: ఎనిమిది నెలల గర్భిణి మృతిచెందిన ఘటన మండలంలోని ఒడ్డురామవరం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జాటోత్ రమేశ్‌తో హారిక (21)కు సుమారు రెండేళ్ల కిందట వివాహం జరిగింది. 8 నెలల గర్భవతి అయిన హారిక అనారోగ్యానికి గురికావడంతో కుటుంబీకులు మంగళవారం పాల్వంచలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బుధవారం ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడం, అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, హారిక అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎటువంటి పోలీసు కేసు నమోదు కాలేదు.

జలగం సోదరుల పరామర్శ

బూర్గంపాడు: బూర్గంపాడుకు చెందిన వైద్యుడు చెన్నం సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చెన్నం సూర్యప్రసాద్‌ల మాతృమూర్తి సావిత్రమ్మ ఇటీవల మృతిచెందగా.. బుధవారం బూర్గంపాడులోని చెన్నం సత్యనారాయణ నివాసానికి రాష్ట్ర మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, మాజీ శాసన సభ్యుడు జలగం వెంకటరావులు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. సావిత్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కం బలరామ్,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గిరిప్రసాద్‌కు ఘన నివాళి

దమ్మపేట: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ 26వ వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. పార్టీ జిల్లా నాయకుడు తంగేళముడి శివకృష్ణ మండల సహాయ కార్యదర్శి సుంకపాక ధర్మ, శ్రీను, నక్క నాగమణి, జాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు రిపోర్టులను నమ్మొద్దు

భద్రాచలంఅర్బన్: ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ జిల్లా ఉపసంచాలకులు డిప్యూటేషన్లలో ఉపాధ్యాయులకు అన్యాయం చేశారనే ఆరోపణపై త్రిసభ్య కమిటీ వేశారని, ఆ కమిటీ ఇచ్చిన తప్పుడు రిపోర్టును నమ్మొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.భూపేందర్ అన్నారు. అది కేవలం డీడీ కుర్చీని లాగేసుకునేందుకు రూపొందించిన కల్పితమని ఆరోపించారు.

ప్రజా గర్జనకు తరలిరండి


మాట్లాడుతున్న అకోజు సునీల్ కుమార్

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి ప్రాంతానికి కేంద్ర ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని నిరసించేందుకు జూన్ 4న కొత్తగూడెంలో జరిగే ప్రజాగర్జన సభకు వేలాదిగా తరలిరావాలని సీపీఐ పట్టణ కార్యదర్శి అకోజు సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఐటీడీఏ రోడ్‌లో జగదీష్ కాలనీ, లంబాడీ కాలనీ, సుందరయ్యనగర్, ఆదర్శనగర్, రాజీవ్ నగర్, మెడికల్ కాలనీల సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో సీపీఐ నాయకులు బత్తుల నరసింహులు, మీసాల భాస్కర రావు, కల్లూరి శ్రీరాములు, గుంజ ఏడుకొండలు, గోసుల శీను, గుంజ బాలరాజు, సోము సుశీల, వంక పాటి తిరుపతి, బద్ది బాబి, హరీష్, సాయి, పండు, జాను, అనిల్, వెంకన్న పాల్గొన్నారు.

బూర్గంపాడు: సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించనున్న ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి మువ్వ వెంకటేశ్వరరావు కోరారు. సారపాకలో బుధవారం ప్రజాగర్జన ప్రచార పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకుల వైఫల్యాలను ఎండగట్టేందుకు మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి జోజయ్య, ఎండీ సాజిద్, జహీర్, గుర్రం శ్రీనివాస్, వంకాలపాటి నాగేశ్వరరావు, చింత వెంకటేశ్వర రావు, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ రోజారాణి కోరారు. మండలంలోని జమ్మిగూడెం, కేశప్పగూడెం, ఆసుపాక గ్రామాల్లోగల కేంద్రాల్లో బుధవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషక లోపాలతో ఉన్న చిన్నారులకు క్రమం తప్పకుండా బాలమృతం ప్లస్‌ను ఇవ్వాలని సూచించారు.

ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సూర్యవతి, కొమరం బాబురావు, కుసనోతు లింగయ్య, కార్యదర్శులు స్పందన, కార్తీక్, మోతీలాల్, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీకుమారి, సర్సమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్‌బ్రిడ్జి వద్ద నీరు నిల్వ


రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద నిల్వ ఉన్న వర్షపునీరు

చండ్రుగొండ: మండలంలోని చండ్రుగొడ–బెండాలపాడు గ్రామాల మధ్య నిర్మించిన రైల్వే అండర్‌బిడ్జి వద్ద వరద నీటి నిల్వతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న అకాలవర్షాలకు అండర్‌బిడ్జి వద్ద వర్షపునీరు చేరాయి. అవి బయటకు వెళ్లే మార్గం లేదు. దీంతో వర్షపునీరు అక్కడే నిల్వ ఉంటోంది. ఫలితంగా మండలకేంద్రం నుంచి బాలికుంట, బెండాలపాడు గ్రామాలకు వెళ్లే ప్రజలతోపాటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడున్నారు. వాహానాల రాకపోకల క్రమంలో బురదనీళ్లు జనంపై చిమ్ముతున్నాయి. దీంతో ధరించిన దుస్తులు సైతం పాడైపోతున్నాయి. రైల్వే అధికారులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం


డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. బుధవారం మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రేగా కాంతారావు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. డయాలసిస్ చేయించుకునే వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుల ద్వారా మణుగూరు కేంద్రంగా డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు, వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, ఆర్ఎంఓ నరేష్, సమితిసింగారం సర్పంచ్ బచ్చల భారతి, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, సొసైటి చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు, ప్రభుత్వ వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటి రాజుపేటకు చెందిన కె లక్ష్మీకి రూ.21వేలు, ముత్యాలమ్మనగర్ గ్రామానికి చెందిన ఏ శ్రీలక్ష్మీకి రూ.24వేల చొప్పున మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, సర్పంచ్‌లు కొమరం జంపేశ్వరి, ఏనిక ప్రసాద్, తాటి రామకృష్ణ, ఎంపీటీసీలు గుడిపూడి కోటేశ్వరరావు, కలగూర శంకర్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠలో రేగా

మణుగూరు మున్సిపాలిటీలోని భగత్‌సింగ్‌నగర్‌లో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన ఆయనను బొడ్రాయి కమిటీ నిర్వాహకులు సాదరం స్వాగతం పలికారు. గ్రామదేవతలను ఎమ్మెల్యే రేగా కాంతారావు దర్శించుకుని గ్రామప్రజలందరిని చల్లగా చూడాలని వేడుకున్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, బొడ్రాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటకు ప్రకృతివనం బోరు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పల్లె ప్రకృతి వనానికి చెందిన బోరు నుంచి ఓ వ్యక్తి అక్రమంగా పామాయిల్ తోటకు తడులు పెట్టుకుంటున్న వ్యవహారం బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని గాండ్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలో బోరు ఉండగా, ఈ బోరు నుంచి గత కొద్ది రోజులుగా సమీపంలోని ఓ పామాయిల్ తోటకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నీళ్లు మళ్లించి వినియోగిస్తున్నారు. ఈ వ్యవహారంపై కొంతమంది గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, స్థానిక ఎంపీఓ సీతారామరాజును విచారణ చేయాల్సిందిగా ఆదేశించారు. దాంతో ఎంపీఓ క్షేత్ర స్థాయికి వెళ్లి పల్లెప్రకృతి వనం బోరును పామాయిల్ తోట బాధ్యులు అక్రమంగా వినియోగిస్తున్నట్లు నిర్ధారించారు. దీనిపై స్థానికులతో మాట్లాడి వివరాలను తెలుసుకుని పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే బోరు నుంచి పామాయిల్ తోటకు వెళ్లిన కనెక్షన్‌ను తొలగించాల్సిందిగా సూచించారు. కాగా పామాయిల్ తోటకు బోరు వినియోగించుకున్నందుకు స్థానిక ఓ ప్రజాప్రతినిధికి చెందిన సమీప బంధువు వసూళ్లకు పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులకు అభినందనల వెల్లువ


దుమ్ముగూడెం: సాయితేజను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్

దుమ్ముగూడెం: ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించిన కొండ సాయి తేజను కలెక్టర్ అనుదీప్ దురిసెట్టి బుధవారం సన్మానించారు. మండలంలోని చిన్న అర్లగుడెం గ్రామానికి చెందిన సాయి తేజ దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుతూ ఎంపీసీ గ్రూప్‌లో 990/1000 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో రెండో రాంక్‌లో నిలిచాడు. కార్యక్రమంలో డీఐఈఓ సులోచన రాణి, కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అశ్వాపురం: ఇంటర్ మొదటి సంవత్సరంలో అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎంపీసీ విభాగంలో 460 మార్కులు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానం సాధించిన నాగ అక్షయను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ శాలువాతో సన్మానించారు. ఐఐటీ జేఈఈ పుస్తకాలు అందజేశారు. ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించడపై అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్‌ను కలెక్టర్ అభినందించారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలోని ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మందపాటి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రంలో సదరు విద్యార్థులకు శాలువా కప్పి, జ్ఞాపికలను అందించి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ లీల్లి సారా, బీఆర్ఎస్ నాయకులు సత్యవరపు సంపూర్ణ, సతీష్ రెడ్డి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయండి


భద్రాచలంటౌన్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యువమోర్చా నాయకులు

దుమ్ముగూడెం: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ బిట్రగుంట క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని నడికుడి గ్రామంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో జరిగే నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తెల్లం శేఖర్, నాయకులు కుర్సం వసంతరావు, కండ్రపు ముత్యాల త్రినాథరెడ్డి, చర్ల మండల ప్రధాన కార్యదర్శి ఎడవల్లి శేషగిరిరావు, తెల్లం చలపతి, మండల సోషల్ మీడియా కన్వీనర్ కాకా రాంబాబు, తిరుపతిరావు, వెంకటేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈ నెల 27న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ములిశెట్టి నిఖిల్ ఆవిష్కరించారు. పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో జరిగిన యువమోర్చా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని నిరుద్యోగ యువత, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో అన్నం హరీష్, సాయి, లక్ష్మణ్, అన్నం సాయి పాల్గొన్నారు.

వీఓఏల సమ్మెకు సంఘీభావం


దుమ్ముగూడెం: వీఓఏల సమ్మెకు మద్దతు తెలుపుతున్న జెడ్పీటీసీ సీతమ్మ

దుమ్ముగూడెం: తమ సమస్యల పరిష్కారం కోసం ఐకేపీ వీఓఏ చేస్తున్న సమ్మెకు జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ సంఘీభావం ప్రకటించారు. బుధవారం సమ్మె శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీఓఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారిని ఐకేపీ సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు కొర్సా చిలకమ్మ, వీఓఏల మండల నాయకులు నాగరాజు, శ్యాం, రమేష్, రమాదేవి, కమల, పాపమ్మ, భద్రమ్మ, దుర్గారాణి, లత, అరుణ, వెంకటరమణ, ఝాన్సీ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌కు బుధవారం వీవోఏలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. మణుగూరు ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్ర ప్రారంభోత్సవానికి వచ్చిన జిల్లా కలెక్టర్‌ను వీవోఏలు కలిసి వినతిపత్రాన్ని సమర్పించి డిమాండ్లను విన్నవించారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనుగోపాల్, మండల అధ్యక్షురాలు సులోచన, మణెమ్మ, రాము, స్రవంతి, లక్ష్మి, శ్రీదేవి, వెంకటరమణ, లలిత, జరీనా, అనురాధ తదితరులు పాల్గొన్నారు.